నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 నిజామాబాద్, సోమవారం 18 నవంబర్ 2024 NIZAMABAD

# నింబాచల బ్రహ్మోత్సవాలు సంపూర్ణం


అశ్వ వాహనంపై నృసింహుడిని ఊరేగిస్తున్న భక్తులు

### గ్రామాలయానికి తరలిన ఉత్సవ విగ్రహాలు

భీమ్‌గల్, నవంబర్ 17: లింబాద్రి గుట్ట కార్తీకమాస బ్రహ్మోత్సవాలు ఆదివారంతో సంపూర్ణమయ్యాయి. ఈ నెల 7 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారంతో ముగిసినట్లు ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి తెలిపారు. గుట్టపై ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రి ఏడు గంటలకు గ్రామాలయానికి బోనాలు, హారతులతో బయల్దేరారు. దారిపొడవునా మహిళలు మంగళహారతులతో స్వామివారికి నీరాజనం పలికారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలుచోటుచేసుకోకుండా ఎస్సై నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జాతర సందర్భంగా గుట్టకింద వెలిసిన దుకాణాలు భక్తులతో కిటకిటలాడాయి.

**గ్రామాలయానికి ఉత్సవ విగ్రహాలు**

శ్రీలక్ష్మీనృసింహుని ఉత్సవ విగ్రహాలు శ్రీవారి కొండ నుంచి భీమ్‌గల్‌కు సాయంత్రం చేరుకున్నాయి. అశ్వవాహనంపై స్వామిని అలంకరించి బాజాభజంత్రీలతో శ్రీలక్ష్మీ నృసింహుడిని గ్రామాలయానికి ఎదుర్కొన్నారు. ఆదివారం ఉదయం కమల పుష్కరిణి మండపంలో స్వామివారికి డోలాసేవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

# లింబాద్రిగుట్టను దర్శించుకున్న జిల్లా జడ్జి


లింబాద్రిగుట్టపై జిల్లా కోర్టు జడ్జి సునీతా కుంచాల

భీమ్‌గల్, నవంబర్ 17 : మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి లింబాద్రి గుట్టను ఆదివారం జిల్లా జడ్జి సునీత కుంచాల దర్శించుకున్నారు. జిల్లా అడిషనల్ జడ్జి వేముల దీప్తితో కలిసి గర్భాలయంలోని శ్రీలక్ష్మీ నృసింహునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి వారిని సాదరంగా ఆహ్వానించి, సంకల్పం చేసి హారతి, ఆశీర్వచనాలను అందించారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలను అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. వారి వెంట సీఐ నవీన్, ఎస్సై మహేశ్ ఉన్నారు.

# మహ్మద్‌నగర్‌లో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం


బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే షిండే

నిజాంసాగర్, నవంబర్ 17 :మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ ఆధ్వర్యంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ముఖ్య అతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, సీడీసీ మాజీ చైర్మన్ గంగారెడ్డి, సొసైటీ చైర్మన్ వాజీద్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ఇతర గ్రామాల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలయ భూములకు
# రక్షణేది?

- చట్టవిరుద్ధంగా లీజులు.. ఏండ్లుగా కౌలు ఎగవేత
- అన్యాక్రాంతమవుతున్న మఠం భూములు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

**ఉమ్మడిజిల్లాలో**
'దేవుడి' భూములకు రక్షణకరువైంది. ఆలయ పరిరక్షణలో సంబంధిత యంత్రాంగం ఉదాసీన వైఖరి.. చట్టాల్లోని లొసుగులు అక్రమార్కులకు వరంగా మారాయి. దీంతో యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే వందలాది ఎకరాలు ఇతరుల చేతుల్లోకి వెళ్లినా.. సంబంధిత శాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. ఏండ్ల క్రితం ఇండ్ల నిర్మాణం, సాగులో ఉన్నవారికి పట్టాపాసు పుస్తకాలు జారీ కాగా.. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. చట్ట విరుద్ధంగా లీజులు, కౌలు ఎగవేతలు తదితర కారణాలతో అక్రమార్కులు దేవాదాయ శాఖ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.
– సుభాష్‌నగర్, నవంబర్ 17

### యథేచ్ఛగా కౌలు ఎగవేత

జిల్లాలో 213.10 ఎకరాలు బడారాంమందిర్ భూములు ఉండగా, నగరశివారు సారంగాపూర్ ప్రాంతంలో 88ఎకరాలు ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో కౌలు కొంత మేర ఉండగా ఏండ్లుగా చెల్లించడం లేదు. ఎక్కువ భాగం కబ్జాకు గురైనట్లు దేవాదాయశాఖ అధికారుల పరిశీలనలో తేలింది. ఒకటి, రెండుచోట్ల 99 ఏండ్లు లీజుకు తీసుకున్నట్లు తెలుస్తోంది. దేవాదాయశాఖ రికార్డుల్లో ఎకరానికి రూ.2వేలు కౌలుగా నిర్ణయించినా లీజుకు తీసుకున్నవారు ఇప్పటివరకూ చెల్లించడం లేదు. నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలో 18 ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి. నగర శివారులో 9.11 ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. ఇటీవలే శాఖ సహాయ కమిషనర్ రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు.

### నిర్వహణలో అంతులేని నిర్లక్ష్యం

దేవాదాయశాఖలో భూముల రికార్డుల నిర్వహణ ఏండ్లుగా నిర్లక్ష్యానికి గురైంది. ఏ భూమి ఎక్కడ ఉందో శాఖ ఉద్యోగులకే హద్దులు తెలియని పరిస్థితి నెలకొన్నది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇతరులు సాగుచేసుకుంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇండ్లు, కొన్నిచోట్ల వాణిజ్య అవసరాలకు షెట్టర్లను నిర్మించారు. ఆలస్యంగా తేరుకున్న అధికారులు వాటి విషయంలో కేసులు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. బడారాంమందిర్ భూములతో పాటు దేవాదాయ శాఖకు సంబంధించిన ఆలయ భూములను పరిరక్షించాలని భక్తులు కోరుతున్నారు.

### ఇతరుల చేతుల్లోకి..1109.09 ఎకరాలు

ఉమ్మడి జిల్లాలో 384 ఆలయాలకు 4153.25 ఎకరాల మాన్యం ఉంది. నిజామాబాద్ జిల్లాలో 247 ఆలయాల పరిధిలోనే 2287.18 ఎకరాలు, కామారెడ్డి జిల్లాలో 137 ఆలయాల పరిధిలో 1866.06 ఎకరాలు ఉన్నట్లు భూరికార్డులు చెబుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలో 23 ఆలయాలకు సంబంధించి 245.22 ఎకరాలు, కామారెడ్డి జిల్లాలోని 23 ఆలయాలకు సంబంధించి 863.27 ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 1109.09 ఎకరాలు ఇతరుల చేతుల్లోకి వెళ్లినట్లు సంబంధిత శాఖనే నిర్ధారించడం గమనార్హం.ఇందులో సదాశివనగర్‌లోని విశ్వేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన 528.24 ఎకరాలు ఉంది. బ్రహ్మపురి పెద్దరాంమందిర్ భూములు రెండు రాష్ట్రాల్లో ఉన్నాయి. మహారాష్ట్రలోని సజ్జన్‌ఘడ్‌లో శివాజీగురువు సమర్థరామదాసు స్థాపించిన మఠానికి అనుబంధంగా ఇందూరులోనూ బడారాంమందిర్ నెలకొల్పారు. దీని పరిధిలో 480.06 ఎకరాలు ఉండగా నిజామాబాద్ జిల్లాలో 213.10, ఆదిలాబాద్‌లో 149.32, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో 117.04 ఎకరాలు ఉన్నాయి. నిజామాబాద్ గ్రామీణం, మోపాల్, మాక్లూర్, నందిపేట్, రెంజల్, బోధన్ 6 మండలాల్లో మఠానికి చెందిన భూములు ఉన్నాయి.





**నోటీసులు ఇస్తున్నాం..**
ఏండ్ల క్రితం అన్యాక్రాంతమైన భూములు, ఇండ్ల నిర్మాణాల విషయంలో దేవాదాయ ట్రిబునల్ ద్వారా నోటీసులు ఇస్తున్నాం. ఇటీవల రాష్ట్ర శాఖ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రికార్డుల ఆధారంగా భూమిని గుర్తించి ఇకపై కబ్జా కాకుండా చర్యలు చేపడుతున్నాం. ఉమ్మడి జిల్లాలో పలు ఆలయ భూములకు శాఖ పర్యవేక్షణలో లీజు, కౌలుకు ఇస్తున్నాం. వీలైనంత వరకు భూములు అన్యాక్రాంతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం.
- విజయ రామారావు,
సహాయ కమిషనర్

# తొలిరోజు ప్రశాంతం

- ఉమ్మడి జిల్లాలో గ్రూప్-3 పరీక్షలు ప్రారంభం
- కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు

ఆలస్యంగా రావడంతో గిరిరాజ్ కళాశాల గేటు బయటే నిల్చున్న అభ్యర్థులు




కంఠేశ్వర్/ కామారెడ్డి, నవంబర్ 17: రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్–3 పరీక్షలు ఉమ్మడి జిల్లాలో ప్రారంభమయ్యాయి. మొదటిరోజైన ఆదివారం పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, కామారెడ్డి జిల్లా రీజినల్ కో–ఆర్డినేటర్ విజయ్‌కుమార్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు నిర్వహించిన మొదటిసెషన్ పరీక్షకు నిజామాబాద్ జిల్లాలో మొత్తం 19,941 మంది అభ్యర్థులకు 10,037 (50.33 శాతం) మంది హాజరుకాగా.. 9904 మంది గైర్హాజరైనట్లు కలెక్టర్ వెల్లడించారు. మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 19,992 మంది అభ్యర్థులకు 9,949 (50.10) మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్న గ్రూప్ –3 పరీక్షకు సంబంధించి కూడా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. అభ్యర్థులు నిబంధనలను తప్పకుండా పాటిస్తూ నిర్ణీత సమయానికి ముందే పరీక్షాకేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఉదయం 9.30 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేస్తారని, తర్వాత లోనికి అనుమతించబోరని స్పష్టంచేశారు.

**కామారెడ్డిలో..**

కామారెడ్డి జిల్లాలో 20 కేంద్రాల్లో గ్రూప్–3 పరీక్ష నిర్వహించినట్లు రీజినల్ కో–ఆర్డినేటర్ విజయ్‌కుమార్ తెలిపారు.

ఉదయం మొత్తం 8,268 మంది అభ్యర్థులకు 4,655 (56.30 శాతం) మంది హాజరు కాగా 3,613 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 8,268 మంది అభ్యర్థులకు 4,644 (56.17 శాతం) మంది హాజరు కాగా.. 3,624 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.


కామారెడ్డిలోని ఓ కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు


అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది






పరీక్ష రాసేందుకు వస్తున్న దివ్యాంగులు



**ఏఎస్సై సాయం..**

ఆర్మూర్‌టౌన్, నవంబర్17: పట్టణంలోని సెయింట్‌పాల్ హైస్కూల్‌లో గ్రూప్–3 పరీక్ష రాయడానికి ఓ మహిళా అభ్యర్థి వెంట తన కుమారుడిని తీసుకొని వచ్చింది. వెంట సంబంధీకులెవరూ లేకపోవడంతో బాబును తీసుకొని పరీక్షా కేంద్రంలోకి వెళ్లగా..అనుమతించలేదు. దీంతో అక్కడ డ్యూటీలో ఉన్న ఆర్మూర్ ఏఎస్సై సలీం చిన్నారిని ఎత్తుకున్నాడు. తండ్రి వచ్చాక బాబుని అప్పగించారు.



విజేతలకు మొదటి బహుమతిని అందజేస్తూ అభినందిస్తున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

# ఉషూ పోటీల నిర్వహణ అభినందనీయం

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి**

ముప్కాల్, నవంబర్ 17: మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఉషూ పోటీలు నిర్వహించడం అభినందనీయమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ, స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఉషూ పోటీలను ఆదివారం నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి వేముల హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒక్కరోజు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్, వీడీసీ అధ్యక్షుడు సిద్ధ రమేశ్, ఏలేటి గంగారెడ్డి, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు మోతె గంగారెడ్డి, కె.గంగాధర్, అంజయ్య, ఫిజికల్ డైరెక్టర్ రాజ్‌కుమార్, మల్లేశ్‌గౌడ్, టి.సాయన్న, జోగు నర్సయ్య, సంజీవ్, థామస్, యువజన సంఘం నాయకులు మధుకర్, సాయిలు, గంగరాజ్, హరీశ్, ముస్కు శ్రీను, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి వేముల చేయూత

### గుండె ఆపరేషన్ కోసం రూ.2.50 లక్షల ఎల్వోసీ అందజేత


గుండె ఆపరేషన్ కోసం రూ.2.50 లక్షల ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, నవంబర్ 17: బాధిత కుటుంబానికి మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అండగా నిలిచారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన సౌందర్య కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నది. నిమ్స్‌లో గుండె ఆపరేషన్ చేయాల్సి ఉండడంతో విషయాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు..మాజీ మంత్రి వేముల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వేముల రూ.2.50 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఎల్‌వోసీ కాపీని హైదరాబాద్‌లో బాధిత కుటుంబీకులకు ఆదివారం అందజేశారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మేలు మరచిపోమని, ఆయనకు జీవితకాలం రుణపడి ఉంటామని సౌందర్య కుటుంబీకులు పేర్కొన్నారు.